
సాక్షి
అనంతపురం
శనివారం । 16 । మార్చి । 2024



చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.31	సెహరీ : 5.10



న్యూస్‌రీల్

ఆగని ప్రలోభాల పర్వం



చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

వజ్రకరూరు: ఓటర్లను ఆకట్టుకునేందుకు తెలుగుదేశం పార్టీ ప్రలోభాల పర్వం కొనసాగిస్తూనే ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో ఎలగైనా గెలవాలని ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తన అనుచరుల ద్వారా చీరల పంపిణీకి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా శుక్రవారం ఎన్ఎంపీ తండాలో అనుచరులు బైక్‌లో కలియదిరుగుతూ చీరలను కవర్‌లో పెట్టి పంచారు. చీరలు తీసుకోవడం ఇష్టం లేని కొందరు పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు తండాకు చేరుకుని విచారణ చేపట్టారు.

వంకర పాదాలకు పరిష్కారం



చిన్నారిని పరిశీలిస్తున్న డాక్టర్ ఆత్మారాం, చిత్రంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అనంతపురం మెడికల్: వంకర పాదాలతో జన్మించిన పిల్లలకు తగు చికిత్సనందిస్తే సత్ఫలితాలుంటాయని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీలో ప్రపంచ జనన అవయవ లోపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులకు ఆర్థో విభాగాధిపతి డాక్టర్ ఆత్మారాం బృందం పరీక్షించి, తగు సూచనలు, సలహాలు అందజేశారు. సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వంకర పాదాలతో ఇబ్బంది పడుతున్న 50 మంది చిన్నారులకు పిండికట్టు, కొన్ని సహాయ పరికరాల ద్వారా పాదాలను త్వరితగతిన సాధారణ స్థితికి తీసుకొచ్చినట్లు చెప్పారు. పుట్టుకతో వచ్చు శారీరక లోపాలున్న చిన్నారులకు డీఈఐసీలో ఉచితంగా సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గౌస్, డీఈఐసీ మేనేజర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షలు ముగిశాయి. మొదటి సంవత్సరం పరీక్షలు ఈ నెల 1న ప్రారంభమై గురువారం ముగియగా, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 2న ప్రారంభమై శుక్రవారంతో ముగిశాయి. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రశాంతంగా ముగియడంతో ఇంటర్ బోర్డు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. చివరి రోజు శుక్రవారం ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ-2, కామర్స్-2 పరీక్షలు జరిగాయి. జనరల్ విద్యార్థులు 16,981 మందికి గాను 16,186 మంది హాజరయ్యారు. 515 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 1,029 మందికి గాను 951 మంది హాజరయ్యారు. 78 మంది గైర్హాజరయ్యారు. అనంతపురంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో కాపీ కొడుతూ ఓ విద్యార్థి డీబార్ అయ్యాడు. ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరమణనాయక్ నాలుగు కేంద్రాలు, డీఈసీ సభ్యులు ఐదు కేంద్రాలు, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు 11 కేంద్రాలు తనిఖీలు చేశాయి. నాలుగు కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు.

ఆ రోజులు మాకొద్దు బాబూ..

- జన్మభూమి కమిటీలంటే జనం బెంబేలు
- అనాటి రోజులు తలచుకుంటేనే భయం
- టీడీపీ హయాంలో అంతా ఏకపక్షం



సాక్షి నెట్‌వర్క్: అది 2014 – 2019 మధ్య కాలం. ఆ ఐదేళ్ల తెలుగుదేశం పాలన ఏకపక్షంగా సాగింది. స్థానిక ప్రజాప్రతినిధులను పక్కనపెట్టి టీడీపీకి చెందిన వారితో జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి పెత్తనం కట్టబెట్టింది. ఆ కమిటీలు రాజ్యాంగేతర శక్తిగా మారి అరాచకం సృష్టించాయి. టీడీపీయేతరులకు నరకం చూపించారు. కేవలం తమ పార్టీకి అనుకూలమైతే చాలు అర్హత లేకపోయినా లబ్ధి చేకూర్చారు. అర్హతలు ఉన్న ఎంతోమందికి అన్యాయం చేశారు. ఓటు వేయలేదని, ప్రత్యర్థి పార్టీకి అభిమానులని, కార్యకర్తలని ముద్ర వేసి సంక్షేమ పథకాలకు దూరం చేశారు. ఇల్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, రుణాలకు దరఖాస్తు చేసుకున్నా.. కాళ్లావేళ్లాపడి ప్రాధేయపడినా కనికరించలేదు. వివిధ పథకాల కింద రుణాల మంజూరులోనూ ఏకపక్షంగానే వ్యవహరించారు. ఏకంగా సభలు, సమావేశాల్లోనే టీడీపీ వారికి తప్ప ఇంకెవ్వరికీ సంక్షేమ పథకాలు ఇచ్చేదే లేదని జన్మభూమి కమిటీ సభ్యులు తెగేసి చెప్పిన సందర్భాలు ఉన్నాయి. ఆఖరుకు రోడ్లు, కాలువల నిర్మాణంలో సైతం వివక్ష చూపించారు. ఐదేళ్ల అరాచకపాలనను ప్రజలు నేటికీ గుర్తు చేసుకుంటున్నారు. ఆ రోజులు మళ్లీ మాకొద్దని స్పష్టం చేస్తున్నారు.

ఇల్లు రాకుండా అడ్డుకున్నారు



ఈ వ్యక్తి పేరు గంగాధర్. ఊరు మర్తాడు. గార్లదిన్నె మండలం. ఇతనికి భార్య సిద్దమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగించేవారు. పూరి గుడిసెలో నివసించేవారు. 2018లో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేసి ఇల్లు కట్టుకోవడానికి అర్హుడని చెప్పడంతో గంగాధర్ సంతోషపడ్డాడు. గుడిసె తొలగించి.. పునాది నిర్మాణం చేపట్టాడు. అయితే అప్పటి జన్మభూమి కమిటీ సభ్యులు అభ్యంతరం తెలపడంతో ఇల్లు మంజూరు చేయలేకపోతున్నామని అధికారులు చెప్పారు. తర్వాత మరో రెండుసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకపోయింది. టీడీపీకి అనుకూలం కాదన్న కారణంతో తనకు ఇల్లు మంజూరు చేయలేదన్న విషయం తెలుసుకున్నాడు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వలంటీర్ ద్వారా దరఖాస్తు చేయగానే ఇల్లు మంజూరు చేశారు. ఇప్పుడు ఇల్లు కట్టుకుని గంగాధర్ కుటుంబం సంతోషంగా ఉంది.

అర్జీలన్నీ బుట్టదాఖలు



రాయదుర్గం పట్టణంలోని 30వ వార్డు సిద్దేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న ఈమె పేరు గంగమ్మ. చేనేత కార్మికురాలు. 2014–19 మధ్య కాలంలో చేనేత పింఛన్ కోసం జన్మభూమి కమిటీలకు పలుమార్లు అర్జీలు ఇచ్చింది. అయినా స్పందన లేదు. దరఖాస్తులు బుట్టదాఖలయ్యాయి. సిఫార్సులు ఉన్న వారికి, ముడుపులు ఇచ్చే వారికి మాత్రమే జన్మభూమి కమిటీ వారు సంక్షేమ పథకాలు మంజూరు చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక దరఖాస్తు చేసిన నెలల వ్యవధిలోనే చేనేత పింఛన్ మంజూరు కావడంతో గంగమ్మ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

బాబొస్తే జన్మభూమి కమిటీలదే పెత్తనం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా సంక్షేమ పథకాలు పేదల ఇంటికే అందిస్తున్నారు. చంద్రబాబు పాలన లో పింఛను కావాలంటే రెండు, మూడు రోజులు పడిగాపులు కాసేవాళ్లం. రేషన్ బియ్యం కావాలంటే స్టోరు దగ్గరకు పోయేవాళ్లం. జగనన్న సీఎం అయ్యాక వలంటీరు వచ్చి అన్ని పథకాలూ ఇంటి వద్దకు వచ్చి ఇస్తున్నారు. ఏం వచ్చినా వెంటనే మాకు చెబుతున్నారు. చంద్రబాబు గెలిస్తే జన్మభూమి కమిటీలదే పెత్తనం. వాళ్లను అడుక్కోవాలి.

– వెంకటేష్, కోనాపురం, బ్రహ్మసముద్రం మండలం

కాళ్లరిగేలా తిరిగాను



ఆనాడు వృద్ధాప్య పింఛన్ కోసం కాళ్లరిగేలా తిరిగాను. ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా జన్మభూమి కమిటీ సభ్యులు– టీడీపీ నాయకులు కరుణించలేదు. ఎప్పుడు అడిగినా వచ్చే సంవత్సరం వస్తుందంటూ చెబుతూ వచ్చారు. జన్మభూమి కమిటీ సభ్యులు పింఛన్ మంజూరు చేయిస్తామని డబ్బులు కూడా ఇప్పించుకున్నారు. అయినా రాలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దరఖాస్తు చేసుకోగానే అర్హతలు పరిశీలించి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేశారు. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– బోయ సిద్దమ్మ, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ మండలం

జన్మభూమి కమిటీ అంటేనే చిరాకు



టీడీపీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ఇచ్చే సబ్సిడీ లోన్‌కు దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు లోన్ మంజూరవుతుందని చెప్పడంతో సంతోషపడ్డాను. చివర్లో జన్మభూమి కమిటీ వారు లోన్ రాకుండా చేశారు. వారికి చాలాసార్లు విన్నవించుకున్నా కనికరించలేదు. ఆర్థికంగా బాగున్న వారికి లోన్ ఇప్పించారు. జన్మభూమి కమిటీ అంటేనే చిరాకు కలుగుతోంది.

– హెచ్.నాగరాజు, కణేకల్లు

సీసీ రోడ్డు పనులు ఆపేశారు



గత టీడీపీ హయాంలో మా గ్రామంలోని బీసీ కాలనీకి రూ.5 లక్షలతో సీసీ రోడ్డు మంజూరైంది. అయితే ఆ కాలనీలో అంతా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఉన్నారన్న కారణంతో రోడ్డు పనులు జరగకుండా జన్మభూమి కమిటీ సభ్యులు అడ్డుకున్నారు. ఇలా చాలా గ్రామాల్లో అభివృద్ధికి ఆటంకం కలిగించారు.

– నారాయణరెడ్డి, వేపకుంట గ్రామం, కనగానపల్లి మండలం

హక్కులు కాలరాశారు



ఆనాడు టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి సర్పంచుల హక్కులను కాలరాసింది. టీడీపీ కార్యకర్తలకు మినహా ఇతరులకు ప్రభుత్వ పథకాలు అందించలేదు. ప్రజల చేత ఎన్నిక కాని జన్మభూమి కమిటీలకు పెత్తనం ఇవ్వడం వల్ల అర్హులకు అన్యాయం జరిగింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వర్గాలు, పార్టీలు చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

– రామకృష్ణనాయుడు, బాలాపురం, పుట్లూరు మండలం

వైఎస్సార్ అభిమానినని పింఛన్ తీసేశారు



నాకు 72 సంవత్సరాలు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పింఛన్ మంజూరైంది. దాదాపు 8 సంవత్సరాలు లబ్ధి పొందాను. గత చంద్రబాబు ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీ సభ్యులు నా పింఛన్ తొలగించారు. వైఎస్సార్ అభిమానినని కావాలనే పింఛన్ తీసేశారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. లంచాలు ఇచ్చిన వారికి, టీడీపీ కండువా కప్పుకున్న వారికే సంక్షేమ పథకాలు అందించారు. చివరకు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నాకు తిరిగి పింఛన్ ఇచ్చారు.

–బాలపెద్దిరెడ్డి, పులిప్రొద్దుటూరు, తాడిపత్రి మండలం

గతంలో నరకం చూశాం



మేము పొట్టకూటి కోసం గతంలో పక్క రాష్ట్రానికి వలస వెళ్లగా, అప్పటి టీడీపీ ప్రభుత్వం రేషన్ కార్డు రద్దు చేసింది. 20 సార్లు రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్నా.. జన్మభూమి కమిటీ సభ్యులు మంజూరు చేయలేదు. నిరుపేదలమైన మాకు ఏ పథకమూ అందకుండా నరకం చూపారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి పీడ విరగడైంది. ఇప్పుడు రేషన్ కార్డుతో పాటు పథకాలన్నీ అందుతున్నాయి.

– లక్ష్మీదేవమ్మ, ఆలూడి, అగళి మండలం

వైద్యుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- శ్రీనివాస న్యూరో ఆస్పత్రిలో విద్యార్థిని మృతి
- ఆందోళనకు దిగిన మృతురాలి బంధువులు



అంకిత మృతదేహం

అనంతపురం: నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో దారుణం చోటు చేసుకుంది. సకాలంలో వైద్యం అందక విద్యార్థిని మృతి చెందింది. డాక్టర్ నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ మృతి చెందిందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. మృతురాలి తండ్రి కథనం మేరకు... అనంతపురం శివారులోని స్టాలిన్‌నగర్‌కు చెందిన రాజు కూతురు యు.అంకిత (19) మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. ఆరు నెలలుగా కమలానగర్‌లోని శ్రీనివాస న్యూరో అండ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డాక్టర్ బి.వెంకటరమణ వద్ద చూపిస్తున్నారు. ఇంటర్మీడియెట్ సెకండియర్ చదువుతున్న అంకితకు ఆరోగ్యం సహకరించకపోవడంతో స్క్రైబ్ ద్వారా పరీక్షలు రాస్తోంది. ఆస్పత్రిలో ఇచ్చిన మందులు వాడటం వల్ల రక్తస్రావమవుతుండటంతో అంకితను కుటుంబ సభ్యులు ఈ నెల 13న 'శ్రీనివాస న్యూరో ఆస్పత్రి'లో చేర్చారు. 14వ తేదీన అత్యవసరంగా రక్తం ఎక్కించాలని వైద్యులు తెలిపారు. అప్పటికప్పుడు తెలిసిన వారితో డబ్బు తీసుకొచ్చి కౌంటర్‌లో కట్టాక చికిత్స ప్రారంభించారు. అయితే గైనకాలజిస్టును సంప్రదించకుండా స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్ల సహకారంతో రక్తం ఎక్కించారు. అర్ధరాత్రి వేళ అమ్మాయి నోటి నుంచి నురగ వచ్చింది. కడుపు నొప్పి కూడా తీవ్రంగా ఉండటంతో కుటుంబ సభ్యులు డాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మామూలే అన్నట్టు వారు మిన్నకుండిపోయారు. భరించలేని నొప్పితో అమ్మాయి విలవిలలాడిపోయింది. అర గంట తర్వాత డాక్టర్ వచ్చి పరీక్షించి అంకిత చనిపోయిందని నిర్ధారించారు. కళ్లెదుటే కూతురు మరణించడంతో తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. ఇప్పటి వరకు రూ.8 లక్షల దాకా ఖర్చు చేసినా అమ్మాయి ప్రాణాలు కాపాడుకోలేకపోయామని కన్నీరుమున్నీరయ్యారు.



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, నాయకులు

ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

సకాలంలో సరైన వైద్యం అందకపోవడం వల్లే అంకిత మృతి చెందిందని ఆరోపిస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీనివాస న్యూరో ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిపినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆస్పత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమ్మాయికి రక్తస్రావం జరిగితే గైనకాలజిస్టును ఎందుకు సంప్రదించలేదని నిలదీశారు. మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

శ్రీనివాస న్యూరో ఆస్పత్రికి షోకాజ్

అనంతపురం మెడికల్: ఇంటర్ విద్యార్థిని అంకిత మృతి ఘటనలో శ్రీనివాస న్యూరో ఆస్పత్రికి డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి షోకాజ్ నోటీసు జారీ చేశారు. కడుపునొప్పి–రక్తస్రావంతో ఆస్పత్రిలో చేరిన అంకిత మృతి చెందిన విషయం తెలియగానే డీఎంహెచ్ఓ శుక్రవారం శ్రీనివాస న్యూరో ఆస్పత్రిని తనిఖీ చేశారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. సమగ్ర విచారణ కోసం కలెక్టర్ గౌతమి ఆదేశాలతో ప్రభుత్వ సర్వజనాస్పత్రి మెడిసిన్, గైనిక్, న్యూరో హెచ్ఓడీలతో విచారణ కమిటీ వేసినట్లు చెప్పారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

రేపు గ్రూప్–1 ప్రిలిమ్స్

- పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి
- రెండు సెషన్లుగా 33 కేంద్రాల్లో పరీక్ష
- ఉమ్మడి జిల్లాలో హాజరుకానున్న 11,587 మంది
- పరీక్ష కో–ఆర్డినేటింగ్ అధికారి మేఘస్వరూప్ ఆదేశం



మాట్లాడుతున్న పరీక్ష కో–ఆర్డినేటింగ్ అధికారి మేఘ స్వరూప్, చిత్రంలో డీఆర్ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 17న జరగనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల కో–ఆర్డినేటింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని 33 కేంద్రాల్లో జరగనున్న పరీక్షకు 11,587 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. పరీక్ష నిర్వహణపై కమిషనర్ శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రెటరీ కె.శ్రీనివాసరావు, సెక్షన్ ఆఫీసర్లు యోగేశ్వరరావు, వెంకటరమణతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష నిర్వహణకు కేంద్రానికి ఒకరు చొప్పున 33 మంది సీనియర్ జిల్లా స్థాయి అధికారులను లైజన్ అధికారులుగా నియమించామన్నారు. వీరు పోలీసు ఎస్కార్ట్‌తో ప్రశ్నపత్రాలను కేంద్రాలకు తీసుకెళ్లాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలుగా ఉన్న కళాశాలల ప్రిన్సిపాళ్లు చీఫ్ సూపరింటెండెంట్లుగా వ్యవహరిస్తారన్నారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్ష రెండు సెషన్లుగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటగల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుతుందన్నారు. పరీక్ష నిర్వహణలో ఏపీపీఎస్సీ నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి అధికారి అనుసరించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకూ తావివ్వకూడదని ఆదేశించారు. కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. వేసవి తీవ్రత నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు.

గంట ముందే చేరుకోవాలి

అభ్యర్థులు నిర్దేశించిన పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని పరీక్ష కో–ఆర్డినేటింగ్ అధికారి మేఘ స్వరూప్ చెప్పారు. హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదేని (ఆధార్, పాన్, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, తదితర) గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎల్రక్టానిక్ వస్తువులను అనుమతించబోరన్నారు.

ఇంటికి సాంకేతిక భద్రత

- ఊరెళుతుంటే అప్రమత్తతతో వ్యవహరించాలి
- ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో దోపిడీలకు చెక్
- నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే

అనంతపురం నగరానికి చెందిన ఓ కుటుంబమంతా కలసి గత ఏడాది అక్టోబర్‌లో ముంబయిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. రెండు రోజుల తర్వాత తాళం వేసిన ఇంటిని గుర్తించిన అదే ప్రాంతానికి చెందిన పాత నేరస్తుడు చోరీకి యత్నించాడు. అయితే ఇంటికి ఎల్‌హెచ్‌ఎంఎస్ భద్రత కల్పించడంతో ఇంట్లోకి దుండగుడు చొరబడిన వెంటనే కంట్రోల్ రూం సిబ్బంది అప్రమత్తమై నిమిషాల వ్యవధిలోనే నేరాన్ని అరికట్టారు. నిందితుడిని అరెస్ట్ చేశారు.

అనంతపురం: ఎండాకాలం మొదలైంది. ఎండలు మండిపోతున్నాయి. సాయంత్రం ఆరు గంటల వరకూ ఎండ తీవ్రత తగ్గడం లేదు. రాత్రిళ్లు చల్లని గాలి కోసం ఆరుబయట నిద్రించేవాళ్లు కొందరు. పిల్లలకు పరీక్షలు పూర్తయ్యాయని విహార యాత్రలకు వెళ్లేవారు మరికొందరు. కారణం ఏదైనా ఇంటి నుంచి బయటకు వెళ్లేటపుడు చిన్నపాటి అప్రమత్తత అవసరం. లేకుంటే భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటే ఇంటిపై పోలీసుల నిఘా ఉంటుంది. లేకుంటే దొంగలు పడి ఉన్నదంతా ఊడ్చుకుపోతారు.

చిన్నపాటి అవకాశాన్నీ వదలని దొంగలు

పిల్లలకు పబ్లిక్ పరీక్షలు ముగిశాక స్వగ్రామాలకు వెళ్లేందుకు సిద్ధమైన వారు వారం రోజుల్లో వస్తాం కదా.. అనే నిర్లక్ష్యంతో ఇంటికి తాళం వేసి వెళ్లిపోతున్నారు. ఈ నిర్లక్ష్యమే దొంగలకు వరంగా మారుతోంది. చిక్కిన చిన్నపాటి అవకాశాన్ని ఆగంతకులు వదిలిపెట్టడం లేదు. ఇంట్లోకి చొరబడి విలువైన వస్తువులు, నగదు దోచేసి వెళ్లిపోతున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉన్నదంతా ఊడ్చిపెట్టుకుపోయిన తర్వాత లబోదిబోమంటూ బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అయితే పోలీసులు అందుబాటులోకి తీసుకువచ్చిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)తో తాళం వేసిన ఇళ్లకు పటిష్టమైన భద్రత కల్పించవచ్చు.

ఆధునిక సాంకేతికతతో చోరీలకు అడ్డుకట్ట

తాళం వేసిన ఇళ్లలో చోరీలను అరికట్టేందుకు పోలీసు శాఖ నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్) అద్భుతమైన ఫలితాలిస్తోంది. తేలిగ్గా డబ్బు సంపాదించేద్దామని దొంగతనానికి ఎవరైనా తెగబడితే ఈ టెక్నాలజీ చుక్కలు చూపిస్తోంది. ఈ సాంకేతికతను అందుబాటులోకి తీసుకు వచ్చిన తర్వాత రాష్ట్రంలోనే తొలిసారిగా వైఎస్సార్ జిల్లా కడపలో పోలీసులు కేవలం 10 నిమిషాల్లోనే దొంగలను పట్టుకున్నారు. నేరం చేస్తుండగానే దుండగులు పట్టుబడుతుండడం సరికొత్త అధ్యాయానికి తెరలేపింది.

ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏర్పాటు చాలా సులువు

ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ కలసి బయటకు వెళ్లే సమయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుందని పోలీసులు అంటున్నారు. ఇంట్లో విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు, ఇంటి దస్తావేజులు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవడం ఉత్తమం. అలా కాకుండా ఇంట్లోనే ఉంచి ఊరెళ్లితుంటే మాత్రం ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సేవలు వినియోగించుకోవడం అత్యుత్తమం. ఇందుకు సంబంధించి నయాపైసా కూడా ఖర్చు కాదు.



- ఆన్‌లైన్‌లో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- యాప్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఓ నంబర్ జనరేట్ అవుతుంది. ఇంటికి తాళం వేసి వెళ్లేటపుడు యాప్‌లో రిక్వెస్ట్ ప్రొటెక్షన్‌ను క్లిక్ చేస్తే పోలీసులు వచ్చి ఇంటికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు.
- ఈ కెమెరాలు ఇంటి యజమాని మొబైల్‌తో పాటు జిల్లా పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానమై ఉంటాయి.
- ఎవరైనా చోరీకి ప్రయత్నిస్తే వెంటనే కమాండ్ కంట్రోల్ రూంలోని అలారం మోగుతుంది. నిమిషాల వ్యవధిలోనే నేరస్తుడిని పోలీసులు పట్టేస్తారు.
- ఇంటర్నెట్ ప్రోటోకాల్ బేస్డ్ (ఐపీ) వైఫై కెమెరాలను పోలీసులు ఉచితంగా అమరుస్తారు.

జియోట్యాగ్‌తో పటిష్ట భద్రత



ఊరెళుతున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి పరిస్థితుల్లోనూ వైరల్ చేయరాదు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సేవలు ఎంతో ఉపయుక్తం. యాప్ ద్వారా రిక్వెస్ట్ పోస్టు చేసినా లేదా, డయల్ 100కు కాల్ చేసి విషయం తెలిపినా పోలీసు శాఖ స్పందిస్తుంది. తాళం వేసిన ఇంటిని జియోట్యాగ్ చేసి మరీ భద్రత కల్పిస్తాం. ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా పటిష్ట భద్రత కల్పిస్తాం. ఈ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి.

– ఆర్.ఎన్.అమ్మిరెడ్డి, డీఐజీ

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో నిఘా



ఇంటికి తాళం వేసి మరో ప్రాంతానికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలి. తద్వారా స్థానిక పోలీసులతో పాటు సీసీ కెమెరాల నిరంతర నిఘా ఉంటుంది. నేరాలను నియంత్రించడంతో పాటు నేరస్తులను వెంటనే అరెస్ట్ చేసి చోరీలు జరగకుండా చేయడమే ఎల్‌హెచ్‌ఎంఎస్ ప్రధాన ఉద్దేశ్యం. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలి.

– కేకేఎన్ అన్బురాజన్, ఎస్పీ

16న కౌన్సెలింగ్

అనంతపురం మెడికల్: ఏపీ వైద్య విధాన పరిషత్‌లో ఖాళీ ఉన్న వివిధ పోస్టుల భర్తీకి సంబంధించి మూడో మెరిట్ లిస్టును అనంతపురం వెబ్‌సైట్, డీసీహెచ్ఎస్ కార్యాలయంలో పొందుపర్చారు. ఎంపికైన అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్, జిరాక్సు పత్రాలతో ఈ నెల 16న డీసీహెచ్ఎస్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

ముగిసిన అధ్యాపకుల శిక్షణ



రిసోర్స్‌పర్సన్లను సన్మానిస్తున్న అధ్యాపకులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఐదు రోజుల పాటు జరిగిన అధ్యాపకుల శిక్షణ శుక్రవారం ముగిసింది. అనంతపురం, గుంతకల్లు ఎస్‌ఆర్సీ పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాలల నుంచి జంతు, జీవ సాంకేతిక శాస్త్ర, జీవ రసాయన శాస్త్ర అధ్యాపకులు శిక్షణకు హాజరయ్యారు. ఆధునిక బోధనా అంశాలపై హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, స్థానిక కీ రిసోర్స్ పర్సన్లు డాక్టర్ జయప్ప, డాక్టర్ రాజశేఖర్ అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, ఓఎస్డీ డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. శిక్షణ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకర్‌రెడ్డి, ఎస్‌ఆర్సీ కోఆర్డినేటర్ లక్ష్మీకాంతంను అభినందించారు.

ఎన్నికల బరిలో ఎస్‌యూసీఐ(సీ)

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల బరిలో సోషలిస్ట్ యూనిట్ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) పార్టీ పోటీ చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ అమర్‌నాథ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు అసెంబ్లీ, నాలుగు లోక్‌సభ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. అనంతపురంలోని ఆజాద్‌నగర్‌లో ఉన్న ఎస్‌యూసీఐ(సీ) జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభ్యర్థుల జాబితాను ఆయన విడుదల చేశారు. డి.రాఘవేంద్ర (అనంతపురం), వి.రవీంద్ర (హిందూపురం), వి.హరీష్‌కుమార్‌రెడ్డి (కర్నూలు), ఎల్.ఎన్.లక్ష్మీసింగ్ (తిరుపతి), ఎల్.హిమద్యుతి (విజయవాడ సెంట్రల్) శాసన సభ స్థానాలకు పోటీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే అనంతపురం లోకసభ స్థానం నుంచి బి.నాగముత్యాలు, విజయవాడ నుంచి జి.లలిత, హిందూపురం నుంచి జి.అశోక్, కర్నూలు నుంచి ఎం.నాగన్న పోటీ చేస్తారన్నారు.

ఐటీ వింగ్ కార్యదర్శిగా రోహిత్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన రోహిత్‌రెడ్డి గంగన నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

ఉచితంగా కార్పొరేట్ విద్య

- ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు
- విద్యాహక్కు చట్టం-2009 ద్వారా ప్రత్యేక, అనాథ, ఎస్సీ, ఎస్టీ, పేద పిల్లలకు 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలు
- ఫీజుల భారం భరించనున్న ప్రభుత్వం
- ఈ నెల 25 వరకూ దరఖాస్తుకు గడువు



ప్రవేశాలకు అంగీకారం తెలుపుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రైవేట్ పాఠశాలలు	
అనంతపురం జిల్లా	473
శ్రీసత్యసాయి జిల్లా	294
ఇప్పటి వరకూ అందిన దరఖాస్తుల సంఖ్య	
అనంతపురం జిల్లా	1,073
శ్రీసత్యసాయి జిల్లా	238

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యాహక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేస్తుండడంతో వేల రూపాయల డొనేషన్లు, ఫీజులు లేకుండా పేద విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పిస్తోంది. విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తుండడంతో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయిస్తూ పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ముందుకు వచ్చాయి. ఇప్పటికే అనంతపురం జిల్లాలో 473, శ్రీసత్యసాయి జిల్లాలో 294 పాఠశాలల యాజమాన్యాలు అంగీకారం తెలుపుతూ విద్యాశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవడమే ఇందుకు నిదర్శనం.

దరఖాస్తులకు ఆహ్వానం

విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. విద్యాహక్కు చట్టం మేరకు ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద వర్గాల పిల్లలకు కేటాయిస్తే ఆ ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. ఈ క్రమంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జగన్ సర్కార్ సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకుంది. ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు నిరాకరించిన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలంటూ ఇప్పటికే విద్యాశాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. గతేడాది (2023-24) ఉమ్మడి జిల్లాలో 804 మంది విద్యార్థులు 1వ తరగతిలో ప్రవేశాలు పొందారు. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ విడులైనప్పటి నుంచి ఇప్పటి వరకూ అనంతపురం జిల్లాలో 835 మంది, సత్యసాయి జిల్లాలో 238 మంది దరఖాస్తు చేసుకున్నారు.

సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబర్

అర్హులైన విద్యార్థులు దరఖాస్తులను http://cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా అందజేయాలి. ఇందుకు ఈ నెల 25 వరకూ విద్యాశాఖ గడువు విధించింది. అడ్మిషన్లపై క్షేత్రస్థాయిలో ఎంఈఓల ద్వారా విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. అందిన దరఖాస్తులను రాష్ట్ర స్థాయిలో పరిశీలించి లాటరీ విధానంలో విద్యార్థులను ఎంపిక చేసి, ఆయా స్కూళ్లకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు. దీనిపై సందేహాల నివృత్తికి ప్రభుత్వం ప్రత్యేకంగా 1800-4258599 టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులోకి తీసుకువచ్చింది.

25 శాతం సీట్లు ఎవరికి?

అనాథ, దివ్యాంగ, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం వెరసి మొత్తం 25 శాతం సీట్లను విద్యాహక్కు చట్టం కింద ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో కేటాయించాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 1.44 లక్షలు మించి ఉండరాదు. విద్యార్థులు నివాసం ఉండే (ఆధార్‌కార్డు ఆధారం) ప్రాంతానికి కిలోమీటరు పరిధిలో ఉన్న పాఠశాలలకు తొలి ప్రాధాన్యత ఇస్తారు. ఆ తర్వాత మూడు కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలకు కేటాయిస్తారు. పూర్తి వివరాలకు సంబంధిత ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలి.

విస్తృత ప్రచారం చేస్తున్నాం



ప్రైవేట్ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్ల అవకాశంపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. మండల విద్యాశాఖ అధికారుల ద్వారా ప్రతి స్కూల్‌లోనూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం. అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకూ 835 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 25వ తేదీ వరకూ దరఖాస్తులకు గడువు ఉంది. రాష్ట్ర స్థాయిలో లాటరీ విధానం ద్వారా ఆయా స్కూళ్లకు విద్యార్థులను ఎంపిక చేస్తారు.

– వరప్రసాదరావు, సమగ్ర శిక్ష ఏపీసీ, అనంతపురం

పేద పిల్లలకు మంచి అవకాశం



విద్యాహక్కు చట్టం-2009 కింద ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పేద పిల్లలు చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ఆయా వర్గాల వారికి ఇదో మంచి అవకాశం. ఫీజుల భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. విద్యాహక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలో గుర్తింపు పొందిన అన్ని పాఠశాలలు ఇప్పటికే ప్రవేశాలకు అంగీకారం తెలుపుతూ పేర్లు నమోదు చేసుకున్నాయి. ఈ నెల 25 వరకూ దరఖాస్తులకు గడువు ఉంది. అర్హత కలిగి, ఆసక్తి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– బి.వరలక్ష్మి, డీఈఓ

మండుతున్న సూరీడు



నిర్మానుష్యంగా మారిన అనంతపురం నగరపాలక సంస్థ ఎదుట ఉన్న రోడ్డు

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- అప్రమత్తమైన ప్రభుత్వం
- కలెక్టర్ ఆదేశాలతో పీహెచ్‌సీల్లో మందులు సిద్ధం
- ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

అనంతపురం మెడికల్: జిల్లాలో భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని అనంతపురం జిల్లా విడపనకల్లులో శుక్రవారం 41.7, ధర్మవరం, సీకే పల్లిలో 40.8 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ క్రమంలో అనంతపురం నగరంలోని రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎండ తీవ్రత, ప్రభావంపై ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలను విస్తృతం చేసింది. ఈ క్రమంలో అప్రమత్తమైన ఆరోగ్యశాఖ సిబ్బంది పీహెచ్‌సీల్లో అవసరమైన మందులు, తదితర సౌలభ్యాలను సిద్ధంగా ఉంచింది.

వడదెబ్బతో అప్రమత్తం

ఎండ తీవ్రత కారణంగా సోకే వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలను వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. తలనొప్పి, తీవ్రమైన జ్వరం, మూత్రం రాకపోవడం, అపస్మారక స్థితిలో వెళ్లడం, పల్స్, బీపీ పడిపోవడం జరుగుతుందన్నారు. మత్తు నిద్ర, ఫిట్స్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కలుషిత నీటిని తాగడం ద్వారా అతిసార ప్రబలే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. అతిసారకు గురైనప్పుడు పల్స్, బీపీ పడిపోయి వ్యక్తి చనిపోయే ప్రమాదం ఉంటుందన్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- రోజూ 5 లీటర్ల నీటిని తాగాలి.
- మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరిబొండం, పండ్ల రసాలు సమపాళ్లలో తీసుకోవాలి.
- బయటకు వెళ్లినప్పుడు గొడుగు, క్యాప్, రుమాలు తప్పనిసరిగా వాడాలి.
- మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సాధ్యమైనంత వరకు ఎండలో బయటకు వెళ్లకపోవడం మంచిది.
- వాహనాల్లో వెళ్లే వారు కూలింగ్ గాగుల్స్ వాడాలి. గాగుల్స్ వాడకపోతే కంటి రెటీనాపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.
- బిగుతుగా ఉండే దుస్తులు కాకుండా కాటన్, తెల్లని దుస్తులు వేసుకోవడం శ్రేయస్కరం.
- చర్మం కమిలిపోకుండా, చర్మవ్యాధులు రాకుండా సన్‌స్క్రీన్ లోషన్లు వాడాలి
- చిన్నపిల్లలు ఎండలో ఆటలాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వడదెబ్బ సోకకుండా ఏం చేయాలి?

- శరీరంలో తగినంత నీటి శాతం లేకపోతే వడదెబ్బ సోకే అవకాశం అధికంగా ఉంటుంది.
- వడదెబ్బ సోకినప్పుడు చల్లని గాలి తగిలే ప్రదేశంలో రోగిని ఉంచాలి. శరీరంపై తేలిక పాటి దుస్తులు ఉండేలా చూసుకోవాలి.
- కూలర్, ఏసీ గాలి తగిలేలా చూసుకోవాలి. తడిగుడ్డతో శరీరాన్ని తుడుస్తూ ఉండాలి.
- శీతల పానీయాలు ఇవ్వకుండా మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తరచూ తాగించాలి
- వీలైనంత త్వరగా దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించాలి

అప్రమత్తం చేస్తున్నాం

వేసవిలో ముందస్తు చర్యలు చేపట్టేలా కలెక్టర్ గౌతమి ఆదేశాలతో పీహెచ్‌సీ వైద్యులను అప్రమత్తం చేశాం. ఆయా పీహెచ్‌సీల పరిధిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం 5 లక్షల ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 84 వేల గ్లూకాన్ డీ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిని వివిధ పీహెచ్‌సీలకు సరఫరా చేస్తున్నాం. ప్రతి పీహెచ్‌సీల్లోనూ సెలైన్ బాటిళ్లతో పాటు ఇతర మందులు, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయి.

– డాక్టర్ భ్రమరాంబదేవి, డీఎంహెచ్ఓ

సన్ స్క్రీన్ లోషన్లు వాడాలి

ఎండకు బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా సన్ స్క్రీన్ లోషన్లు వాడాలి. ముఖ్యంగా సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్ (ఎస్‌పీఎఫ్) 50 శాతం ఉండే లోషన్‌ను బయటకు వెళ్లే 15 నిమిషాల ముందు ముఖానికి రాసుకోవాలి. తద్వారా అల్ట్రా వయొలెట్ కిరణాలు చర్మాన్ని దెబ్బతీయకుండా కాపాడుకోవచ్చు. నిర్లక్ష్యం చేస్తే ముఖం కమిలిపోయి ట్యాన్ ఏర్పడి, చర్మం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. రోజూ రెండు సార్లు స్నానం చేయడం ద్వారా ఎలాంటి ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు దరిచేరవు.

– డాక్టర్ పవిత్ర, చర్మవ్యాధి నిపుణురాలు, అనంతపురం

ముగిసిన ఉద్యానతోటల పరిశీలన



కుందుర్పి మండలం అప్పిలేపల్లిలో మామిడి రైతులతో సమావేశమైన ఉద్యానశాఖ అధికారుల బృందం

అనంతపురం అగ్రికల్చర్/శింగనమల : వేసవిలో ఎదురయ్యే నీటి ఎద్దడి, ఉద్యాన పంటలకు ఆశించే చీడపీడలు, రైతుల సమస్యల పరిశీలన నిమిత్తం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఏపీఎంఐపీ, భూగర్భ జలశాఖకు చెందిన రాష్ట్రస్థాయి అధికారుల బృందం రెండు రోజుల జిల్లా పర్యటన శుక్రవారం ముగిసింది. రెండో రోజు ఓ బృందం వైఎస్సార్ జిల్లా పులివెందుల, లింగాల మండలాలకు వెళ్లగా మిగిలిన మూడు బృందాలు శెట్టూరు, కుందుర్పి, కళ్యాణదుర్గం, బెళుగుప్ప, బుక్కరాయసముద్రం, శింగనమల మండలాల్లో పర్యటించాయి. ఇందులో ఏపీఎంఐపీ ఓఎస్డీలు వై.వెంకటేశ్వర్లు, డి.రమేష్, ఉద్యానశాఖ ఏడీ ఎస్వీ రత్నాచార్యులు, భూగర్భజలశాఖ ఏడీ జయరామిరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ అధికారులు రఘునాథరెడ్డి, ఫిరోజ్‌ఖాన్, బీఎంపీ నరసింహారావు, ఉద్యాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ దత్తారెడ్డి, హెచ్‌ఓలు రత్నకుమార్, శైలజ తదితరులు చీనీతో పాటు మామిడి, దానిమ్మ, వక్క, అరటి, బొప్పాయి తదితర తోటలను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో రైతులతో సమావేశమై వాస్తవ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అన్ని పంటల పరిస్థితి బాగానే ఉన్నట్లు గుర్తించిన బృందం అక్కడక్కడ నీటి ఎద్దడి, మామిడిలో తేనెమంచు పురుగు, పండు ఈగ సమస్య ఉన్నట్లు గుర్తించారు. అలాగే చీనీలో వేరుకుళ్లు తెగులు, పొలుసుపురుగు, మంగునల్లి సమస్య ఉండగా వాటి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, నీటి యాజమాన్యం, ఇంకుడు గుంతలు, ఫారంపాండ్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం వర్తింపు, ఉద్యానశాఖ పథకాలు, డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకంపై చైతన్య పరిచారు. రెండు రోజుల అధ్యయనంపై ఉద్యానశాఖ కమిషనరేట్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు బృందం అధికారులు తెలిపారు.

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా రామచంద్రారెడ్డి



ఉత్తర్వులు అందుకుంటున్న రామచంద్రారెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా నార్పల మండలం దుగుమర్రికి చెందిన వి.రామచంద్రారెడ్డి నియమితులయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తన చాంబర్‌లో ఉత్తర్వులను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. తనకు కీలక బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

టీటీడీ ముఖ్య కార్య నిర్వాహకుడిగా మోహనయ్య

అనంతపురం కల్చరల్: జిల్లా హిందూ ధర్మప్రచార పరిషత్తు ముఖ్య కార్యనిర్వాహకులుగా మోహనయ్య నియమితులయ్యారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను శుక్రవారం హిందూ ధర్మప్రచార పరిషత్తు అసిస్టెంట్ మేనేజర్ తిరుమలరావు, ప్రోగ్రాం అసిస్టెంట్ బాబు, పండిట్ వేణు, లతాకుమారి తదితరులు సత్కరించి ఆహ్వానం పలికారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారిణిని అభినందిస్తున్న సాఫ్ట్‌బాల్ ఏపీ సీఈఓ వెంకటేశులు

అనంతపురం: ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకూ మహారాష్ట్రలోని ఔరంగాబాద్ వేదికగా జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే బాలబాలికల జట్ల ఎంపిక ప్రక్రియ శుక్రవారం అనంత క్రీడాగ్రామంలో నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 200 మంది క్రీడాకారులు హాజరు కాగా, వీరిలో ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన బాలుర జట్టులో జి.నానిబాబు, కె.రోహిత్, జ్యోతి ప్రకాష్, జనార్ధన్ (విజయనగరం), శశి, మురళి (అనంతపురం), వంశీ (చిత్తూరు), జగన్, సాత్విక్ (కర్నూలు), పవన్ (శ్రీకాకుళం), ధీరజ్ (నెల్లూరు), చరణ్‌తేజ (ప్రకాశం), బద్రీనాథ్ (వైఎస్సార్), కుష్వంత్ (కృష్ణా), కార్తీక్, పార్థసారథి (గుంటూరు), మనోజ్ (విశాఖపట్నం), వీరబాబు (తూర్పు గోదావరి) ఉన్నారు. అలాగే బాలికల జట్టులో దేవీప్రియ (శ్రీకాకుళం), వి.చైతన్య, తేజస్విణి, భువనేశ్వరి (విజయనగరం), కె.తిరుమల (గుంటూరు), కె.దీవెన (ప్రకాశం), ఆర్.సానియా, బి.భాగ్యలక్ష్మి (అనంతపురం), ఎ.ఉమ, పి.ఇందు, ఆర్.హేమలత(చిత్తూరు), వి.వాసంతి (ప్రకాశం), వి.పూర్ణిమ (తూర్పు గోదావరి). పి.వినయ, పి.సన్నీ (వైఎస్సార్), ఎం. కృతిక (కర్నూలు) చోటు దక్కించుకున్నారు. వీరికి ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకూ అనంత క్రీడాగ్రామంలో శిక్షణా శిబిరం ఉంటుందని ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు తెలిపారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, పీడీ గోపాలరెడ్డి, చిత్తూరు జిల్లా సెక్రెటరీ రమేష్, సాంబశివరావు (ఎన్టీఆర్ జిల్లా), నరసింహారెడ్డి (గుంటూరు) పాల్గొన్నారు.

'తపాలా'లో సీనియారిటీ జాబితా సిద్ధం

అనంతపురం సిటీ: తపాలా శాఖలో ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఆ శాఖ ఉన్నతాధికారులు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో సీనియారిటీ జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఈ నెల ఒకటి నుంచి ఈ ప్రక్రియ మొదలైంది. ఆరేళ్లు, మూడేళ్ల సర్వీసు ఒకే చోట పూర్తి చేసిన వారు తప్పనిసరిగా బదిలీలకు ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంది. వీటిని ఏప్రిల్ 12న పరిశీలించి, అదే నెల 30వ తేదీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న వారు జూన్ 30వ తేదీలోపు ఆయా స్థానాల్లో జాయినింగ్ రిపోర్టు చేయాల్సి ఉంది. కాగా, అనంతపురం తపాలా శాఖ డివిజన్ వ్యాప్తంగా మొత్తం 44 స్థానాలు ఖాళీలు ఉండగా, ఒకే చోట ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు 22 మంది, మూడేళ్ల సర్వీసు పూర్తయిన వారు 29 మంది ఉన్నట్లు తేలింది. వీరు తప్పనిసరిగా ఈ నెల 22వ తేదీలోపు బదిలీలకు ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామానికి చెందిన 19 సంవత్సరాల యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వజ్రకరూరు ఎస్‌ఐ నరేష్ శుక్రవారం వెల్లడించారు. గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి... శుక్రవారం ఉదయమైనా ఇంటికి చేరుకోకపోవడంతో యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

అరటి చెట్టుకు ఐదు గెలలు



పెద్దవపప్పూరు: ఒక్క అరటి చెట్టుకు ఒక్క గెల వేయడం సర్వ సాధారణం. ఒకే చెట్టుకు ఐదు గెలలు వేయడం చాలా అరుదు. ఇలాంటి అరుదైన ఘటనే పెద్దపప్పూరు మండలం ధర్మాపురం గ్రామంలో వెలుగు చూసింది. వివరాలు... ధర్మాపురానికి చెందిన రైతు రవిశంకరనాయుడు 20 ఏళ్లుగా అరటి సాగు చేస్తున్నారు. కొన్ని నెలల క్రితం అజీత్ రకం అరటి మొక్కలను నాటారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తోటకెళ్లి పరిశీలించినప్పుడు ఓ చెట్టుకు ఐదు గెలలు కనిపించాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న పరిసర గ్రామాల రైతులు రవిశంకరనాయుడు తోటకెళ్లి చెట్టును పరిశీలించారు. ఉద్యాన అధికారి ఉమాదేవి మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు అరుదుగా జరుగుతాయని, జన్యుపరమైన మార్పుల కారణంగా ఒకటి కంటే ఎక్కువ గెలలు వేస్తాయని పేర్కొన్నారు.

18న జిల్లా స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు

రాప్తాడు: ఈ నెల 18న రాప్తాడు మండలం అయ్యవారిపల్లిలో జిల్లా స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. గ్రామంలో వెలసిన ఎర్రిస్వామి తాత ఉట్ల పరుష సందర్భంగా ఆ గ్రామ కాల్వగోంచి ఆధ్వర్యంలో ఈ పోటీలు ఉంటాయని గ్రామస్తులు తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీల్లో కేవలం దేశవు ఎద్దులను మాత్రమే అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేత వృషభాల యజమానులకు నగదు పురస్కారాలతో సత్కరించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 63039 33991, 96767 60345లో సంప్రదించాలని కోరారు.

కోనేరులో పడి బాలుడి మృతి



మృతి చెందిన హరికిరణ్

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామంలో జరుగుతున్న మాధవరాజుల ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. ఉత్సవాల్లో పాల్గొనేందుకు కుటుంబసభ్యులతో కలసి వచ్చిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు కోనేరులో పడి మృతి చెందాడు. వివరాలు... రామగిరి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన హరికిరణ్ (10), అదే గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్నాడు. తమ బంధువులతో కలసి శుక్రవారం సనప మాధవరాజుల పరుషకు వచ్చాడు. ఈ క్రమంలో స్నానం చేసేందుకు ఆలయం వద్ద ఉన్న కోనేరులోకి దిగిన బాలుడు.. ప్రమాదవశాత్తు కాలుజారి అందులోకి పడిపోయాడు. విషయాన్ని గమనించిన అక్కడి వారు వెంటనే కోనేరులో దూకి బాలుడిని వెలికి తీసేలోపు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అక్కడు చేరుకుని గుండెలవిసేలా రోదించారు.

క్లుప్తంగా

నాణ్యమైన సేవలందించాలి



మాట్లాడుతున్న జిల్లా సరఫరాల అధికారి శోభారాణి

అనంతపురం అర్బన్: వినియోదారులకు నాణ్యమైన సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని జిల్లా సరఫరాల అధికారి శోభారాణి (డీఎస్‌ఓ) శోభారాణి సూచించారు. శుక్రవారం పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రపంచ వినియోదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 'వినియోగదారులకు న్యాయమైన, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు' అంశంపై చర్చించారు. డీఎస్‌ఓ మాట్లాడుతూ.. వినియోగదారులకు మరిన్ని మెరుగైన, నాణ్యమైన సేవలను సత్వరం అందించే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. ప్రధానంగా వినియోదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా వినియోగాదరుల సమాచార కేంద్రం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, జిల్లా వినియోగదారుల రక్షణ కౌన్సిల్ సభ్యులు, వినియోగదారుల వలంటరీ ఆర్గనైజేషన్ ప్రతినిధి మోహన్, ఏఎస్‌ఓ జగన్, పౌర సరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న తోపుదుర్తి చందు

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామంలో మాధవరాజుల స్వామి జాతరను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో పురాతన బావిలో నాణేలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. మాధవరాజుల జాతర సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తోపుదుర్తి బ్రదర్స్ ఆధ్వర్యంలో రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన వృషభాల యజమానులకు ప్రథమ బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5 వేల చొప్పున అందజేశారు.

న్యాక్ ఏ డబుల్ ప్లస్ లక్ష్యం



ప్రొఫెసర్ టి.త్యాగరాజన్‌ను సత్కరిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు, తదితరులు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ)కు 2029 న్యాక్ ఏ డబుల్ ప్లస్ లక్ష్యంగా కృషి చేద్దామని వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు అన్నారు. ప్రస్తుతం న్యాక్ ఏ గ్రేడ్ దక్కిన సందర్భంగా న్యాక్ ఇచ్చిన రిపోర్టు, గైడ్‌పై చర్చించారు. భవిష్యత్తులో తీసుకోవాల్సిన ప్రధాన అంశాలపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అన్నా యూనివర్సిటీ చెన్నై ఎమిరటస్ ప్రొఫెసర్ టి. త్యాగరాజన్‌ను సత్కరించారు. న్యాక్ ఏ గ్రేడ్ రావడానికి ప్రొఫెసర్ టి.త్యాగరాజన్ మార్గనిర్దేశం చేశారని కొనియాడారు. అంశాల వారీగా చర్చించి పాటించాల్సిన నియమాల గురించి వివరించారు. 2029కి న్యాక్ ఏ డబుల్ ప్లస్ రావడానికి పాటించాల్సిన అంశాలను పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బా రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ ఏ.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రఘు సైనిక్ స్కూల్ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సంగమేష్ నగర్‌లోని రఘు సైనిక్‌స్కూల్ విద్యార్థులను అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి అభినందించారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో విద్యార్థులతో ముచ్చటించారు. చిన్నప్పటి నుంచే దేశభక్తి, సైన్యంలో చేరాలనే ఆసక్తి ఉండటంఅభినందనీయమని పేర్కొన్నారు. స్కూల్ తరఫున 220 మంది ప్రవేశ పరీక్ష రాయగా.. 210 మంది అర్హత సాధించడం గొప్ప విషయమన్నారు. కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో రఘు స్కూల్ డైరెక్టర్లు రఘు, గురు ప్రసాద్, లోకేష్, ఇన్‌చార్జులు సత్యవతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ బడ్జెట్ రూ.180.19 కోట్లు

- ఆమోదం తెలిపిన స్టాండింగ్ కమిటీ
- హాజరైన మేయర్ వసీం, కమిషనర్ మేఘస్వరూప్



మాట్లాడుతున్న మేయర్ వసీం, చిత్రంలో కమిషనర్ మేఘస్వరూప్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ 2024-25 బడ్జెట్ రూ.180.19 కోట్లకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. శుక్రవారం నగరపాలక సంస్థలో మేయర్ వసీం అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో కమిషనర్ మేఘ స్వరూప్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. నగరపాలక సంస్థ 2023-24 సంవత్సరం సవరించిన బడ్జెట్ ప్రారంభ నిల్వ అంచనా రూ.107.64 కోట్లు కాగా, ఈ ఏడాది బడ్జెట్ అంచనా ప్రారంభ నిల్వ రూ.125.85 కోట్లుగా పొందుపర్చారు.

ఆదాయం రూ.112.60 కోట్లు.. మూలధనం రూ.67.58 కోట్లు

నగరపాలక సంస్థకు ఆదాయం రూ.112.60 కోట్లు (రెవెన్యూ) కాగా, అందులో సాధారణ వ్యయాలు రూ.93.88 కోట్లు మిగులు రూ.18.72 కోట్లు చూయించారు. అదేవిధంగా మూలధనం రూ.67.58 కోట్లు ఉన్నట్లు బడ్జెట్‌లో పొందుపర్చారు. ఆదాయానికి సంబంధించి ఆస్తి పన్ను రూ.50 కోట్లు, నీటి పన్ను రూ.7.5 కోట్లు, బీపీఎస్ అప్లికేషన్ రుసుము రూ.8 కోట్లు, బిల్డింగ్ లైసెన్స్ ఫీజు రూ.3.5 కోట్లు, షాపు రూం బాడుగలు రూ.5 కోట్లు, ఖాళీ జాగా పన్ను రూ.4.25 కోట్లు, ఆస్తి పన్ను మార్పిడి ఫీజులు రూ.2.8 కోట్లు, సర్‌చార్జ్ స్టాంపు డ్యూటీ చార్జీలు రూ.10 కోట్లు, తదితర వాటిని ఆదాయంగా చూపారు. రెవెన్యూ ఖర్చులకు సంబంధించి కార్మికుల వేతనాలకు రూ.30 లక్షలు, ఆఫీస్ అద్దె వాహనాలకు రూ.30 లక్షలు, భవనాలు, రిపేరీలకు రూ.కోటి, వీధి దీపాలు, విద్యుత్ చార్జీల చెల్లింపులకు రూ.4.5 కోట్లు, ఎల్ఈడీ లైట్ల నిర్వహణకు రూ.2.5 కోట్లు, క్లాప్ కార్యక్రమానికి రూ.3.5 కోట్లు, తదితర వాటిని ఖర్చులో చూపించారు.

స్టాండింగ్ కమిటీలో 33 అంశాల ఆమోదం

బడ్జెట్ సమావేశం అనంతరం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు 33 అంశాలను ఆమోదించారు. ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి సదరు ఏజెన్సీకి రూ.7,45,000 (7.45 లక్షలు), పారిశుధ్య కార్మికులకు సాఫ్ట్‌వేర్ అప్లికేషన్, ఫేస్ రికగ్నేషన్ యాప్ (ఎఫ్ఆర్ఎస్) చేయడానికి రూ.8.6 లక్షలు సదరు ఏజెన్సీకి చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లో 36, 42, 51 షాపుల కేటాయింపు, సంత, మటన్ మార్కెట్‌కు బహిరంగ వేలంపాటకు ఆమోదం తెలిపారు. 14వ డివిజన్‌లో రూ.28,82,435 సీసీ రోడ్డు, 32వ డివిజన్‌లోని అభయ ఆంజనేయ స్వామి పార్కులో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు, 1వ డివిజన్‌లో ఎంజీ కాలనీ రైల్వే రోడ్డు విస్తరణకు రూ.12 లక్షలు, 5వ డివిజన్‌లో రూ.13.80 లక్షలతో సీసీ రోడ్డు, రూ.54 లక్షల వ్యయంతో సీఎన్‌జీ వాహనం కొనుగోలు, పూడికతీత పనులకు రూ.16 లక్షలు, 11వ డివిజన్‌లో రూ.11.5 లక్షలతో సీసీ రోడ్డు, 29వ డివిజన్‌లో రూ.25.5 లక్షలతో సీసీ రోడ్డు, 16వ డివిజన్‌లో రూ.14.90 లక్షలతో ఫుట్‌పాత్, 32వ డివిజన్‌లో రూ.11 లక్షలతో బీటీ రినీవల్ కోట్స్, 1వ డివిజన్‌లో రూ.26 లక్షలతో సీసీ రోడ్డు, 19వ డివిజన్‌లో రూ.12.90 సీసీ కాలువ, 4, 45, 50వ డివిజన్లలో సైపుల్లా ఆర్‌ఓబీ నందు రూ.19.2 లక్షలతో బీటీ రోడ్డు, 13వ డివిజన్‌లో రూ.37 లక్షలతో రక్షణ గోడ, పీఏబీఆర్ డ్యాంలో రూ.50 లక్షలతో 500 హెచ్‌పీ మోటర్ కొనుగోలు, తదితర వాటికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

గతేడాదికంటే బడ్జెట్ పెంపు

గతేడాది నగరపాలక సంస్థ బడ్జెట్ రూ.166.84 కోట్లు కాగా.. ఈ ఏడాది రూ.180.19 కోట్లు కేటాయించాము. గతేడాది కంటే అదనంగా రూ.13.35 కోట్లు కేటాయించడం జరిగిందని మేయర్ వసీం పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవ, పాలకవర్గం కృషితో నగరం రూపురేఖలు మార్చేశామన్నారు. బడ్జెట్‌లో 40 శాతం నిధులు మురికివాడలకు, 15 శాతం షెడ్యూల్ కులాలకు, 5.5 శాతం షెడ్యూల్ తెగల ప్రాంతాల్లో అభివృద్ధికి కేటాయిస్తున్నట్లు తెలిపారు.

సభ్యుల అభ్యంతరాలు

నగరంలో అనధికారికంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని స్టాండింగ్ కమిటీ సభ్యుడు అబూసలేహ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేస్తున్నారని, సమస్య పరిష్కరించకమునుపే.. సమస్యకు పరిష్కారం చూపినట్లు తనకే సందేశం పంపారని సభ్యుడు శేఖర్‌బాబు ఏసీపీ మారుతీప్రసాద్‌పై మండిపడ్డారు. సమస్య పరిష్కరించకముందే తాను తప్పుడు నివేదికను పంపినట్లు ఏసీపీ మారుతీప్రసాద్ ఒప్పుకున్నాడు. నడిమివంకలో పూడికతీత పనులు చేపట్టాలని సభ్యురాలు రాజేశ్వరి కమిషనర్‌కు విన్నవించారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మరో స్టాండింగ్ కమిటీ సభ్యురాలు లీలావతి, అదనపు కమిషనర్ శ్రీహరి బాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎస్ఈ రామమోహన్ రెడ్డి, ఈఈలు సూర్యనారాయణ, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలసిన మహాలక్ష్మి



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్

అనంతపురం కార్పొరేషన్: సీఎం క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం

అనంతపురం రూరల్: ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి చొరవతోనే రుద్రంపేట పంచాయతీ అన్ని విధాలా అభివృద్ధి చెందిందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధిక్‌వలి, ఎంపీటీసీ సభ్యురాలు మహబూబీ అన్నారు. శుక్రవారం రుద్రంపేట పంచాయతీ పరిధిలోని చైతన్య కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ చేశారు. చంద్రబాబునగర్‌లో దాదాపు రూ.1.50 కోట్లతో పలు అభివృద్ధి పనులతో పాటు ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటు చేసి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపామన్నారు. మసీదు కాంపౌండ్ నిర్మాణంతో పాటు చైతన్య కాలనీలో మొదలు పెట్టిన సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. వెంకటరాముడు, అక్కమ్మ, జ్యోతి, జయమ్మ, కృష్ణవేణి, మద్దన్న, లతీఫ్ పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే సంక్షేమ పాలన



వైఎస్సార్ చేయూత సంబరాలకు హాజరైన మహిళలు



చేయూత మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: సీఎం వైఎస్ జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం. అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్న జగనన్నకు ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రానికి సమీపంలో జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించిన విలేజ్‌హెల్త్ క్లినిక్, ప్రభుత్వాసుపత్రి వద్ద నిర్మించిన గ్రామ వార్డు సచివాలయాన్ని ప్రారంభించారు. అలాగే మండల పరిధిలోని న్యామద్దెల గ్రామంలో నిర్మించిన గ్రామ, వార్డు సచివాలయ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం చెన్నేకొత్తపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్ చేయూత సంబరాలు నిర్వహించారు. రూ.3.66 కోట్ల వైఎస్సార్ చేయూత మెగాచెక్కును మహిళలకు అందజేశారు. అలాగే ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. నిత్యం రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే కమిటీ చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. అక్కచెల్లెమ్మలను చేయూత పథకం ద్వారా ఆదుకుంటున్నారన్నారు. అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనతో పాటు మరిన్ని పథకాలు అమలు చేశారని కొనియాడారు. ప్రతి ఒక్కరికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ఇంటి పట్టాలు ఇచ్చామన్నారు. ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఫ్యాన్ ఇంట్లో ఉండాలి.. సైకిల్ ఇంటి బయట.. గ్లాసు సింక్‌లో ఉండాలని సూచించారు. 14 ఏళ్ల టీడీపీ పాలనలో అభివృద్ధి జరగలేదన్నారు. సీఎం జగన్ అవినీతికి తావు లేకుండా పథకాలు అమలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, డోలా రామచంద్రారెడ్డి, కన్వీనర్ నర్సిరెడ్డి, చెన్నేకొత్తపల్లి, మేడాపురం సర్పంచులు ధనుశ్రీ, రామాంజనేయులు, నాయకులు ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి, కిష్ట, ప్రసాద్, రామకృష్ణారెడ్డి, నారాయణ స్వామి, ఓబులేసు, మందల నరసింహులు, కృష్ణమూర్తి, పవన్‌కుమార్‌రెడ్డి, మాడెం ప్రకాష్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు, పొదుపు సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రబాబుకు రాజకీయ సన్యాసం ఖాయం



చిన్మయనగర్‌లో ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కేఎస్ పాళ్యంలో ప్రచారం చేస్తున్న దృశ్యం

రాప్తాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు కొట్టే దెబ్బతో చంద్రబాబుకు రాజకీయ సన్యాసం తప్పదని ఉమ్మడి జిల్లా గొర్రెలు, మేకల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ కోరారు. శుక్రవారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. గత టీడీపీ పాలనలో హామీలు అమలు చేయకుండా మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని గుర్తు చేశారు. చంద్రబాబు ఎంత మందితో పొత్తులు పెట్టుకున్న ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల యూత్ కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నల రవికుమార్, వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, విజయ్‌వర్ధన్ రెడ్డి, బోయ మనోహర్, డీలర్ సాంబ శివా రెడ్డి, నరసింహా రెడ్డి, చిన్న క్రిష్టా రెడ్డి, మాచిరెడ్డి చెన్నారెడ్డి, ఉషారాణి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందాం

కనగానపల్లి: పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఎంపీపీ భాగ్యమ్మ తెలిపారు. మండలంలోని కేఎస్ పాళ్యం గ్రామంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. గత టీడీపీ ఇచ్చిన దొంగ హామీలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు నాగముని, సుధీర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటరాముడు, ప్రభాకర్, ఎంపీటీసీలు క్రిష్టా రెడ్డి, ఆదినారాయణ, సర్పంచులు అంజినప్ప, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డితోనే నియోజకవర్గ అభివృద్ధి



తారు రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తోపుదుర్తి చందు

ఆత్మకూరు: ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డితోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని మదిగుబ్బ గ్రామంలో మదిగుబ్బ నుంచి బి.యాలేరు వరకూ తారు రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.20 లక్షల జిల్లా పరిషత్ నిధులతో రోడ్డు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ నాయకులు అభివృద్ధి చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. రోడ్డు వేస్తుంటే అడ్డుపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాల పోతన్న, ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, సర్పంచ్ నరసింహ, ఎంపీటీసీలు లక్ష్మీదేవి, ఓబులేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరాంజనేయులు, వాసుదేవరెడ్డి, ఫణిరెడ్డి, నరసింహారెడ్డి, ఎర్రిస్వామి, మహేష్, అతిక్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, శివారెడ్డి, మాజీ ఎంపీపీ హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పట్టా రద్దు చేయండి



తహసీల్దార్ సీతారాంతో మాట్లాడుతున్న తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి

రాప్తాడు: గ్రామ సచివాలయ మహిళ పోలీసు అక్రమంగా చేయించుకున్న ఇంటి పట్టాను రద్దు చేయాలని తహసీల్దార్ సీతారాంను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి కోరారు. వివరాల్లోకి వెళ్లితే.. రాప్తాడు సచివాలయం-2లో విధులు నిర్వహిస్తున్న మహిళ పోలీస్ రాజేశ్వరి తన కుటుంబ సభ్యులైన మాజీ మిలటరీ ఉద్యోగి శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన సుంకర చంద్రశేఖర్ పేరు మీద గత ఏడాది జూన్ 9వ తేదీన సర్వే నంబర్ 134-1లో 5 సెంట్ల స్థలాన్ని చేపించుకుంది. దీనిపై హైకోర్టుకు వెళ్లి అక్కడ ఇంటి నిర్మాణం చేపట్టేందుకు స్టే కూడా తెచ్చుకున్నట్లు సమాచారం. గురువారం ఇంటి నిర్మాణం చేపట్టేందుకు రాప్తాడుకు చెందిన బెల్దారి శేఖర్‌ను స్థలం వద్దకు తీసుకెళ్లింది. ఈ విషయంపై మాజీ సైనికులు ఆమెతో వాగ్వాదానికి దిగారు. మాకు కాకుండా శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన మాజీ సైనికుడికి ఇక్కడ ఇంటి పట్టా ఎలా ఇప్పిస్తారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి రాప్తాడు తహసీల్దార్ సీతారాంతో మాట్లాడారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేసిన డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ నరసింహ రూల్స్‌కు వ్యతిరేకంతగా పట్టా చేయడం జరిగిందన్నారు. ఆమెకు పట్టా ఇవ్వక ముందే అదే స్థలంలో విలేకరులకు కూడా రెవెన్యూ అధికారులు పట్టాలు చేయడం జరిగిందన్నారు. మిలటరీలో పని చేసే వారు ప్రసన్నాయపల్లి పంచాయతీలోనే వందలాది మంది మాజీ ఉద్యోగులు ఉన్నారని, వారికి కాకుండా వేరే జిల్లా వాళ్లకు ఇక్కడ పట్టా ఎలా చేస్తారని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. ఇదే విషయంపై అప్పట్లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రాజేశ్వరి బంధువుల పేరు మీద చేపించుకున్న ఇంటి పట్టాను రద్దు చేయాలని అప్పటి ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మీనరసింహంను ఆదేశించడం జరిగిందన్నారు. తహసీల్దార్ సీతారాం మాట్లాడుతూ.. మాజీ మిలటరీ ఉద్యోగికి కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టాను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అలా కాకుండా తహసీల్దార్ ఒక్కరే ఇంటి పట్టా ఇచ్చేందుకు వీలు లేదన్నారు. విచారించి ఆ పట్టాను రద్దు చేసేందుకు ఆర్డీఓకు నివేదిక పంపుతానని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

'ఈనాం' విధానం వద్దు

అనంతపురం అగ్రికల్చర్: చీనీ క్రయ విక్రయాలకు సంబంధించి కేంద్రం ప్రవేశ పెట్టిన 'ఈనాం' విధానాన్ని రద్దు చేసి, బహిరంగ వేలం పాట నిర్వహించాలని సీపీఎం అనుబంధ రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం మార్కెట్ యార్డులో చీనీ మార్కెట్‌ను సందర్శించి చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. వ్యాపారులు సిండికేట్‌గా తయారై ఈనాం కింద తక్కువ ధర ఇస్తున్నందున.. బహిరంగ వేలం అమలు చేయాలని కోరారు. పెరుగుతున్న పండ్లతోటలు, వస్తున్న చీనీ సరుకుకు అనుగుణంగా మార్కెట్‌యార్డులో షెడ్లు, కోల్డ్‌స్టోరేజీ సదుపాయం కల్పించాలన్నారు. ధరలు రైతులకు తెలిసేలా డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనల మేరకు కమీషన్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, వి.శివారెడ్డి, కుళ్లాయప్ప, రామ్‌గోపాలరెడ్డి, క్రిష్టారెడ్డి, టి.చెన్నారెడ్డి, వెంకటేసు, సత్యనారాయణరెడ్డి, శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నానో టెక్నాలజీపై సదస్సు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం విద్యార్థులకు 'నానోటెక్నాలజీ-క్వాంటమ్ డాట్స్' అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బెంగుళూరు-ఎంఎస్ రామయ్య ఇనిస్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ పి.మురళీకృష్ణ విద్యార్థులకు నానోటెక్నాలజీ, క్వాంటమ్ డాట్స్ అనే అంశంపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భక్తవత్సలం, అధ్యాపకులు శివరామ్, పల్లవి, రాజశేఖర్ రెడ్డి, ఫుల్ సింగ్, రాజు, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం

అనంతపురం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని ఆర్డీఓ (అనంతపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్) అధికారి గ్రంధి వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ సూచించే నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎన్నికలు సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నగదు, మద్యం అక్రమ రవాణాను అరికట్టడానికి చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక నిఘా వర్గాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ పద్మావతి, అర్బన్ తహసీల్దార్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: తమకు కనీస వేతనం పెంపుతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికులు కోరారు. శుక్రవారం మునిసిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఇంజినీరింగ్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంజీవరాయుడు, మల్లికార్జున మాట్లాడారు. మునిసిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న విధంగా ఇంజినీరింగ్ కార్మికులకూ కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలన్నారు. అదే విధంగా గతంలో సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి అంజన్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ, నాయకులు నాగరాజు, ఓబుళపతి, మురళీ, పోతులయ్య, రమేష్ పాల్గొన్నారు.

నేడు 22వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 22వ డివిజన్‌లో శనివారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బుద్ధప్పనగర్‌లోని రాజేంద్ర నగరపాలక పాఠశాల నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పోరాటంతోనే మహిళలకు సమాన హక్కులు

అనంతపురం ఎడ్యుకేషన్: నేటి సమాజంలో మహిళలు అనుభవిస్తున్న హక్కులు పోరాటంతో సాధించుకున్నవేనని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) నగర గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన తెలిపారు. జేవీవీ నగర కమిటీ, సమత ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్ట్స్ కళాశాల మహిళా హాస్టల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. నేటి విద్యార్థినులే రేపటి నాయకురాళ్లు అన్నారు. ఐక్యమత్యంతో చేసే పోరాటాలతోనే హక్కులు నిలుపుకోగలమన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు హేమామాలిని, సత్యసాయి కళాశాల తెలుగు అధ్యాపకురాలు యమునా రాణి, సమత జిల్లా కన్వీనర్ విజయలక్ష్మి, నాయకులు రాధా, లక్ష్మి, శశికళ, రాజ్యలక్ష్మి, జన విజ్ఞాన వేదిక నగర కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.